
మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





బాలికల ఇంటర్మీడియట్ కళాశాలను సందర్శించిన కలెక్టర్

## పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి, ముఖ్య పర్యవేక్షకుడికి (చీఫ్ సూపరింటెండెంట్) పలు సూచనలు చేశారు. విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించే ముందు ఖచ్చితంగా తనిఖీలు నిర్వహించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, గడియారాలు వంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను విద్యార్థులకు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ వివరాల ప్రకారం తొలిరోజున తమ పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు మొత్తం 385 మంది విద్యార్థులకు గాను 370 మంది హాజరయ్యారని 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా ఇంటర్ విద్యా అధికారి అంజయ్య పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## ఓటరు జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలి

**గద్వాల ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేసి పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్ని మండలాల తహసీల్దార్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, భూ భారతి దరఖాస్తులు, రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల జారీ తదితర అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎలాంటి తప్పిదాలు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సమర్థంగా అమలు చేయాలన్నారు. 2025 తాజా ఓటరు జాబితాలోని పేర్లను 2002 ఓటరు జాబితాతో సరిపోల్చి మ్యాపింగ్ చేయాలన్నారు. ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేసి పురోగతి సాధించాలని ఆదేశించారు. తక్కువ పురోగతి ఉన్న బీఎల్‌ఎలు, సూపర్వైజర్లతో చర్చించి సమస్యను అధిగమించి వెంటనే పూర్తి చేయాలన్నారు. సవరణలో భాగంగా ఏవైనా పేర్ల తొలగింపులు లేదా చేర్పులు ఉంటే వాటిని పూర్తి స్థాయి పరిశీలన అనంతరం మాత్రమే నమోదు చేయాలని అన్నారు. భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గద్వాల్, గట్టు మండలాల్లో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవని అట్టి వాటిని ప్రాధాన్యతతో తక్షణమే పూర్తి చేయాలని సంబధిత తహసీల్దార్లకు ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని, స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ లాగిన్ సమయానికి అవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్ లో ఆర్డీఓ శ్రీనివాస రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ప్రజలు మెచ్చే పరిపాలన అందించాలి

### జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

**నారాయణ పేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ప్రజలు నమ్మకంతో ఓటు వేసి గెలిపించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ఐదేళ్ల పాటు ప్రజలు మెచ్చే పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సర్పంచి పదవి కేవలం హోదా కాదని, అది ఒక బాధ్యత కర్తవ్యమని ఆమె పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జరుగుతున్న సర్పంచుల ఓరియంటేషన్ శిక్షణా శిబిరాన్ని జిల్లా ఎస్పీ డా. వినీత్‌కుమార్‌తో -మిగతా4లో..

## గ్రామ అభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర కీలకం




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**గండీడ్. ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** గండీడ్ మండలంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమై మూడో రోజు కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కాలెక్టర్ విజయేంద్ర భోయి విజిట్ చేయడం జరిగింది. గ్రామాలలో వార్డుల్లో సమస్యల పరిష్కారం లో వార్డు మెంబర్లు కీలకమని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై రోటవేటర్లను పంపిణీ చేశారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ మల్లికార్జునరావు, మండల ఎంపీడీవో మండల తినివీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి. గండేడ్ గ్రామ సర్పంచ్ భగవంతురెడ్డి, శిక్షణాధ్యాపకులు వార్డ్‌మెంబర్స్, మండల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొనడం జరిగింది.

# నిందితులను అరెస్టు చేయకపోతే అసెంబ్లీలో నిలదీస్తాం

- మహేంద్ర నాథ్ పుట్టిన గడ్డపై ఇంతటి దుర్మార్గమా..
- "కుమ్మెర ఘటన మాటలకు అందని మహావిషాదం..
- దేవుడి దర్శనం కోసం వస్తే రజక కుటుంబం పై దాడి చేస్తారా
- భర్తను వదలాలని బిడ్డను పాదాల వద్ద పెడితే తన్ని చంపుతారా
- పసికందును చంపిన మానవ మృగాలకు శిక్ష పడాలి..
- అధికార పార్టీకి తొత్తులుగా పోలీసులు..
- అంబేద్కర్ సాక్షిగా న్యాయం కోరుతున్న కుటుంబానికి అన్యాయమే
- కుమ్మెర బాధితుల పరామర్శలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు కేటీఆర్..



నిరసన దీక్షకు హాజరైన నాయకులు, కార్యకర్తలు



బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి వర్యులు కేటీఆర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాత వార్త:** మాజీ మంత్రి పుట్టపాక మహేంద్ర నాథ్ పుట్టిన గడ్డలో ఇంతటి దుర్మార్గమా, సామాజిక న్యాయం పుట్టిన గడ్డపైనే ఇలాంటి కుల వివక్షతో కూడిన దుర్మార్గపు దాడి హత్య జరగడం అమానుషమని టీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు కేటీఆర్ పేర్కొన్నారు. రెండు నెలల పసిగుడ్డకు మతం కులం రాజకీయం అంటే తెలుసా... పుట్టిన తర్వాత పుట్టుకొచ్చే కులాలు మతాలపై 21వ శతాబ్దంలో కూడా ఇలాంటి అవమానియా ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఈ వ్యవస్థను చూసి తలవదించుకోవాల్సిన దుస్థితిని కాంగ్రెస్ పాలకులు తీసుకువచ్చారని ఆయన దుయ్య బట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన ఘటన మాటలకు అందని మహా విషాదమని, రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తామన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కుమ్మెర ఘటనలో రెండు నెలల చిన్నారిని కోల్పోయిన కుటుంబం చేస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం కేటీఆర్ సందర్శించి బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన విషయాలను బాధితులు చంద్రకళ, గణేష్, మౌనికలను అడిగి తెలుసుకున్నారు. వారికి అండగా ఉంటామని న్యాయం జరిగే వరకు పోరాడుతామని కేటీఆర్ భరోసా అందించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ మండలపరిధిలోని కుమ్మెర మల్లన్న జాతరలో దర్శనం కోరిన చంద్రకళ కుటుంబాన్ని అధికారం, రాజకీయ అహం, స్థానిక ఎమ్మెల్యే అండదండలు చూసుకుని వేలాదిమంది ప్రజల సమక్షంలో ఆ కుటుంబాన్ని సూటిపోటి మాటలతో అవమానించడమే కాకుండా ఈ విషయాన్ని ప్రశ్నించిన చంద్రకళ కుమారుడు గణేష్‌ను జాతరలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొబ్బరికాయల దుకాణంలో తీసుకువెళ్లి 8 మంది విచక్షణారహితంగా బండ బూతులు తిడుతూ... చంద్రకళ, మౌనిక, గణేష్ లపై దాడికి దిగడమే కాకుండా... తన రెండు నెలల చిన్నారి ముఖం చూసి అయినా తన భర్తను వదిలి పెట్టాలని కాళ్ళ వేళ్ళపడి తన కూతురిని శ్రీనివాస్ రెడ్డి, తుకారాంరెడ్డిలతో పాటు తదితరుల కాళ్లపై చిన్నారిని పెట్టి వేడుకుంటుండగా అదే కాలితో దయ దాక్షి ణ్యం లేకుండా తన్నడం ద్వారా చికిత్స పొందుతూ రెండు నెలల చిన్నారి ప్రాణాలు వదిలిందని కేటీఆర్ అన్నారు. ఈ ఘటన తనను కలిచి వేసిందని బాధితుల నోటితో వారి మాటలు వింటుంటే కళ్ళు చెమర్చాయి అన్నారు. అహంకారంతో కొట్టిన కుమ్మెర సర్పంచ్ ఇతర ఏడుగురిపై చట్ట రిత్యా చర్యలు తీసుకొని వారిని శిక్షించకపోతే అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ లో జరుగుతున్న అరాచక పాలనపై నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో సాగుతున్నది పేరుకే ప్రజా పాలన అని... సాగుతున్నది మాత్రం అరాచక పాలన అని కేటీఆర్ దుయ్యబట్టారు. కుమ్మెర ఘటన మాటలుకు అందని మహావిషాదమని నిందితులకు అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే ఇతర రాజకీయ నాయకులపై కూడా కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పసికందులు చంపిన మానవ మృగాలకు శిక్ష పడాలని అందుకు అవసరమైన అన్ని సెక్షన్‌లలో నిష్పక్షపాతంగా పోలీసులు కేసులు నమోదు చేసి నిందితులను అందరిని వెంటనే అరెస్టు చేసి తమ నిజాయితీని చాటుకోవాలని పోలీసులకు సూచించారు. పోలీసులు అధికార పార్టీకి ఆ పార్టీ నాయకులకు గులాములుగా మారి పోలీసు యూనిఫారంకు గౌరవం లేకుండా చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 18వ తేదీన ఘటన - మిగతా4లో..

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు



సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతూ, ప్రతి అర్హుడికి లాభం చేకూరేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొల్లాపూర్ నియోజకవర్గం పరిధి వీపన్‌గండ్ల మండలానికి సంబందించిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఇల్లు మంజూరు అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణం ప్రారంభించకపోవడానికి గల కారణాలను వ్యక్తిగతంగా తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇళ్ల నిర్మాణం ఆలస్యం అవుతున్నట్లయితే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు కల్పించి వారికి సహకరించాలని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారులు అధిక వడ్డీ రుణాలు లేదా అప్పులు చేయకుండా అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం, ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పథకం సక్రమంగా అమలవుతూ ప్రతి అర్హుడికి లాభం చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**సమస్యల పైన వచ్చిన అర్జీలపై మంత్రి సమీక్ష...**

అదే విధంగా వీపనగండ్ల మండల పరిధిలో ఆయా గ్రామాల్లో రైతుల భూ సమస్యల పైన వచ్చిన అర్జీలపై మంత్రి సమీక్షించారు. వీపనగండ్ల గ్రామానికి సంబంధించి సర్వే నెంబర్లు 389, 399,400,588,589లలో రెండు వర్గాల మధ్య ఉన్న భూ సమస్యను వెరిఫై చేసి పరిష్కరించి న్యాయం చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. దాంతో పాటుగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పెట్టుకున్న భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను సత్వరం పరిష్కరించి న్యాయం చేకూర్చాలన్నారు. రైతులు ప్రజల అర్జీలకు సంబంధిత అధికారులు జవాబుదారీ తనంతో బదులు ఇవ్వాలని తెలియజేశారు. రైతుల ఫిర్యాదులపై తహసిల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి వెరిఫై చేసి సమస్య పరిష్కారం దిశగా మార్గం చూపాలన్నారు. రాబోయే 15 రోజుల్లో రైతుల అర్జీలు అన్నిటిని పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు ఏ స్థాయి వారైనా సరే చట్ట విరుద్ధంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఇతర అధికారులు, వీపనగండ్ల మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## దాడులను సహించం

### ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర బాధితులను ఎస్సీ,ఎస్టీకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్‌లు బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పరామర్శించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడుల విషయంలో ఎలాంటి నిరక్ష్యం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సీ, ఎస్టీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్లో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఘటనకు సంబంధించిన పూర్వాపరాలు, కేసు నమోదు ప్రక్రియ, బాధ్యులపై తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సహాయం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రులు గణేష్, మౌనిక కుటుంబ సభ్యులతో ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అన్నివిధాలుగా హామీ ఉంటామని, నిందితులకు కఠిన శిక్షలు అమలు జరిగే వరకు ఎస్సీ ఎస్టీ కమిషన్ బాధితుల పక్షాన నిలుస్తుందని, బాధితులకు అవసరమైన - మిగతా4లో..




మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

## లబ్ధిదారులకు రుణ సదుపాయం

### ఇండ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ ఆరా

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయంగా ముందస్తు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నవారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థిక సహాయం అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలంలోని పెద్దగూడెం తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను -మిగతా4లో..



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సమయానుసారం పరీక్షలు నిర్వహించాలి
- మహమ్మదాబాద్ పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మహమ్మదాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మహమ్మదాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణి స్త్రీలకు సమయానుసారం పరీక్షలు నిర్వహించి, సరైన వైద్య సేవలు అందించాలనీ పిహెచ్‌సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సికు చెకప్ కోసం వచ్చిన గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడారు. వారికి ఇది ఎన్నో డెలివరీ, హిమోగ్లోబిన్ (ఐరన్) శాతం ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ శాతం తగ్గితే బలహీనత, నీరసం వస్తాయని, అందువల్ల సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీ రిజిస్టర్‌ను పరిశీలించి, హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న గర్భిణీ స్త్రీలకు ఐరన్ ఇంజక్షన్లు అందిస్తున్నారా అని మెడికల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లో నమోదైన గర్భిణీలకు స్వయంగా ఫోన్ చేసి, వారు నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారా, ఐరన్ ఇంజక్షన్లు తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో ఎన్ని డెలివరీలు జరిగాయి అని మెడికల్ అధికారికి జిల్లా కలెక్టర్ అడుగగా, ఈ నెలలో మొత్తం 28 డెలివరీలు నమోదు కాగా, ఇప్పటివరకు 8 డెలివరీలు జరిగాయని మెడికల్ అధికారి తెలిపారు. గర్భిణీ స్త్రీలకు ప్రతి నెలా సమయానుసారంగా పరీక్షలు నిర్వహించాలని, వారికి కావలసిన మందులను, వైద్య సేవలను సరిగా అందించాలని ఆదేశించారు. అనంతరం ఓపి విభాగంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, రోజుకు ఎంతమంది ఓపీ రోగులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 38 మంది ఓపీ రోగులు నమోదు అయినట్లు వైద్య అధికారులు తెలిపారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి, మందుల కొరత ఏదైనా ఉందా అని ప్రశ్నించగా, మందుల కొరత లేదని అధికారులు తెలిపారు. నమోదైన రోగులు ఎలాంటి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారో కూడా కలెక్టర్ ఆరా తీశారు. ల్యాబ్, ప్రసవ గది తదితర విభాగాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. పిహెచ్‌సిలో కాంపౌండ్ వాల్ విరిగిపోవడం గమనించి, అక్కడున్న ఎంపీడీవోను వెంటనే వివరణ కోరారు. అదేవిధంగా, మహమ్మదాబాద్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పిహెచ్‌సి పరిసరాలలో చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ ఉండడం గమనించి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడం తమ బాధ్యత కాదా అని ప్రశ్నించారు.



పీహెచ్‌సిలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## రూ.15 లక్షల నిధులతో డ్రైనేజీ పనులు

**మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో శరవేగంగా అభివృద్ధి పనులు**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో దాదాపు రూ.15లక్షల నిధులతో డ్రైనేజీ పనులను స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కురి పావని ప్రారంభించగా మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, కమిషనర్ శ్రీరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని మాట్లాడుతూ మంత్రి డా. వాకిటి శ్రీహరి నేతృత్వంలో మక్తల్ పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే పలుచోట్ల సిసి రోడ్లు, డ్రైనేజీల పనులు ప్రారంభం కాగా తాజాగా 16వ వార్డులో రూ.15 లక్షల నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభించామని, వార్డు కౌన్సిలర్ గా గెలిచిన వెంటనే సిసి రోడ్లో పనులు సైతం 16 వార్డులో ప్రారంభించామని, అవి తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో 16 వార్డుతో పాటు మక్తల్ మున్సిపాలిటీ, నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుందామని, ప్రతి ఒక్కరూ మంత్రి వాకిటి శ్రీహరికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

## సొంతింటి కల నెరవేరిన వేళ

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నేతలు**

**కోయిలకొండ ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కాగా, మరికొన్నిచోట్ల సొంతింటి కల నెరవేరే విధంగా గృహప్రవేశాలు జోరందుకున్నాయి. దీంట్లో భాగంగానే బుధవారం మండల కేంద్రమైన కోయిలకొండలో ఎలిమే రాములు ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి రవీందర్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై విద్యాసాగర్ గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద ప్రజలను ఆదుకోవడానికి అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వమిచ్చిన నిధులతో సంతోషంగా లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకొని గృహప్రవేశాలు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. గ్రామంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి ఆనంద్, గ్రామ ఉపసర్పంచ్ డి తిరుపతయ్య గౌడ్, వార్డు సభ్యుడు, నారాయణపేట నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఎం రామస్వామి, నాయకులు రవి నాయక్, దిలీప్ శర్మ, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



నూతన గృహప్రవేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు

## ప్రగతి స్కూల్‌లో సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం

**గద్వాల ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** పట్టణంలోని బీసీ కాలనీలో గల ప్రగతి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగ జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి సందర్శించి విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన వాటిలో చంద్రయాన్, మోక్ష ప్రదర్శన, సేవ్ ద గర్ల్ చైల్డ్, సేవ్ ట్రీస్, సె నో టూ డ్రగ్స్, ప్రమాదాల నివారణ, హ్యూమన్ అవ్యాలేషన్, సోలార్ ఇరిగేషన్ ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.స్కూల్‌లో మొత్తం 530 ప్రదర్శనలు చేయడం జరిగిందనీ స్కూల్ కరస్పాండెంట్ సవరన్న తెలిపారు. ఇవేకాక జాతీయ నాయకుల వేషదారాన, సోషియల్ వర్కర్స్, డాక్టర్, పోస్ట్ మ్యాన్, వివిధ వేషధారణలో మరో 200 మంది విద్యార్థులు ప్రదర్శనలు చేయడం జరిగిందనీ సవరన్న తెలిపారు. విద్యార్థుల ప్రతిభను చూసి డిఈఓ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.స్కూల్ టీచర్లు లత,అరుణ, సత్యన్న, షాహిన, రేవతి ప్రధానమైన భూమిక పోషించారని కరస్పాండెంట్ సవరన్న తెలిపారు.ఈ సందర్శనలో డి.ఈ.ఓ.తో పాటు ఎం.ఈ.ఓ.శ్రీనివాస గౌడ్, టీచర్ మైకేల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి

## నాగర్‌కర్నూల్‌లో దారుణం

**నిందితుల అరెస్టుకు బహుజన సంఘాల డిమాండ్**

**ధన్వాడ,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మేరా గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై ధన్వాడ మండలంలో తీవ్రఆగ్రహం వ్యక్తమైంది. రజక కులానికి చెందిన ఓ మహిళ తన పసిపాపతో కలిసి మల్లన్న జాతర దర్శనానికి వెళ్తున్న సమయంలో అగ్రకులానికి చెందిన వ్యక్తులు దాడిచేసి, పసిపాప మృతి చెందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై వెంటనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తంలించాలని డిమాండ్ చేస్తూ ధన్వాడ మండల ఎస్సీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి కురువ నవీన్ స్పందించారు. పేరు ప్రక్కన తోక ఉంటే (ఎఫ్ఐఆర్) నమోదు చేయరా? ఒక వర్గానికి ఒక న్యాయం, బహుజన బిడ్డలకు మరో న్యాయమా?” అంటూ ఆయన ప్రశ్నించారు. మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం తరపున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికంగా ప్రజా సంఘాలు, బహుజన నాయకులు ఘటనను ఖండిస్తూ, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



కురువ నవీన్

## న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం

**సీనియర్ న్యాయవాది జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** న్యాయవాదుల పైన జరుగుతున్న దాడులు దురదృష్టకరమని సత్వరమే ప్రభుత్వం వెంటనే న్యాయవాద రక్షణ చట్టం బిల్లును తీసుకొచ్చి న్యాయ వాదులకు రక్షణగా నిలవాలని సీనియర్ న్యాయవాది,నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం అచ్చంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అచ్చంపేట న్యాయవాదులు చేపడుతున్న నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనేక రోజులుగా న్యాయవాదులపైన జరుగుతున్న జాడల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే బిల్లును అమలు చేయాలని ఆయన కోరారు. దీక్షా శిబిరంలో న్యాయవాదులు మస్తాన్, కర్నె లక్ష్మీనారాయణ, వెంకట్ శెట్టి, సత్తయ్య, వంజ రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, మల్లేష్, తదితర న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

## నిందితులను వెంటనే శిక్షించాలి

**బిఎస్‌పి నాయకుడు శ్రీకాంత్ ముదిరాజ్**

**నవాబుపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** దైవ దర్శనానికి వెళ్లిన తల్లి కూతుళ్ళ పై అమానుషంగా దాడికి పాల్పడి దళిత పసిబిడ్డ మరణానికి కారణమైన నిందితులను వెంటనే శిక్షించాలని నవాబుపేట బిఎస్పి నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్ ధర్నా కార్యక్రమంలో అన్నారు. కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఘటన పట్ల అధికారులు స్పందించాలని, ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్నిరెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఎస్పీ నాయకులు కార్యకర్తలు తదితరులు కుమ్మెర ధర్నాలో పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న బిఎస్పీ నాయకులు

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**గద్వాల ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని జ్ఞాన ప్రభ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని బుధవారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆకస్మిక తనిఖీ చేశారు.నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం అయిన దృష్ట్యా కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షకు విద్యార్థుల హాజరు వివరాలు, నిఘా కెమెరాల ఏర్పాటు మరియు వాటి పనితీరు, సిట్టింగ్ ఏర్పాట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ తదితర అంశాలపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు,ఇన్విజిలేటర్లు మరియు ఇతర సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కళాశాల ప్రాంగణంలోకి తీసుకురాకుండా ఖచ్చితమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరిపై ప్రవేశ ద్వారం వద్దనే కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిబంధనలకు అనుగుణంగా జరగాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు.మాల్ ప్రాక్టీసులను పూర్తిగా నివారించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది పరీక్షలు ముగిసే వరకు అందుబాటులోనే ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాలు,పరీక్ష అనంతరం జవాబు పత్రాలు సహా అన్ని గోప్యమైన (కాన్ఫిడెన్షియల్) పత్రాలను నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా రవాణా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు,డిఎస్పీ మొగలయ్య,పరీక్ష కేంద్రం సిబ్బంధి,తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాల కవర్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## కళ్యాణం.. కమనీయం

**ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవం**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. వేద పండితుల మధ్య కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది .కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వధువు తరపున, వరుడు తరపున కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. కళ్యాణానికి ముందు ఉదయం 6.03 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, అర్చనలు, దూప దీప నైవేద్యం,8.01గంటలకు విఘ్నేశ్వర పూజ, స్వామివారికి అభిషేకం, అర్చనలు, దూప దీప నైవేద్యం, ఉదయం 10.08 గంటలకు పుణ్యాహ వాచన, నవగ్రహ పూజ, సామూహిక గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం స్వామివారి పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ అధ్యక్షులు చెన్ రెడ్డి యాదిరెడ్డి రెడ్డి దంపతులు, గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి దంపతులు , పిరట్వాన్ పల్లి సర్పంచ్ వీరోజు సుప్రియ, మురళి మాజీ సింగిల్ విండో చైర్మన్ వీరోజు చంద్రమౌళి దంపతులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, వెల్టూరు మాజీ ఎంపిటిసి రెడ్డి రెడ్డి రంగారెడ్డి, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు.



అయ్యవారిపల్లిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం



శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేస్తున్న భక్తులు

**శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం**

అయ్యవారిపల్లి లో బుధవారం జరిగిన 18 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం జరిగింది. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, భూపతి దీప నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్లు అందజేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**గద్వాల ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయం ఎదుట అరైవ్ అలైవ్ రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ అరైవ్ అలైవ్ కేవలం నినాదం కాదని,ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరాలనే సామాజిక బాధ్యతను గుర్తు చేసే ఉద్యమని తెలిపారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం కుటుంబాలకు తీరనిలోటని అందువల్ల ప్రతి వాహనదారుడు రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం చలానా భయంతో కాదని,ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,సీట్ బెల్టు ధరించాలని, మద్యంసేవించి వాహనాలు నడపడం పూర్తిగా మానుకోవాలని,అతివేగం,రాంగ్‌రూట్ డ్రైవింగ్,మొబైల్ ఫోన్ వినియోగం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి,ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరగవని అతివేగం,నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రధాన కారణాలు అని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరు రహదారి నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు.ప్రతి ఒక్కరు బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు."మీరు సురక్షితంగా ఉంటేనే మీ కుటుంబం సంతోషంగా ఉంటుంది”అనే సందేశంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనం నడపాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. నేటి నుంచి కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించాలని లేకుంటే అనుమతించడం జరగదు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ మొగలయ్య,సి.ఐ టంగుటూరి శ్రీను,ట్రాఫిక్ ఎస్సై బాల చంద్రుడు, పోలీస్ సిబ్బంది,వాహనదారులు,తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ అందజేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు

## న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. వనపర్తి జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న వరుస దాడులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల డిమాండ్ ను నెరవేర్చాలని కోరారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలయ్యేవరకు న్యాయవాదుల ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. న్యాయవాదులు ఒకపక్క పాదయాత్ర చేపడుతున్న మరో పక్క రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న న్యాయవాదుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. న్యాయవాదులకు పరిరక్షణ చట్టం ఎంతైనా అవసరమని వారన్నారు రెండో రోజు రిలే దీక్షలో న్యాయవాదులు శ్రీనివాస్ గౌడ్ ,ఎండి బాబా ,రేణుక ,లక్ష్మీ ,ప్రవీణ్ కుమార్ ,అజీజ్ కురుమూర్తి దీక్షలో కూర్చున్నారు. దీక్షలో కూర్చున్న న్యాయ వాదులకు వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చేర్మెన్ మధుసూదన్ గౌడ్, వర్తక సంఘము నాయకులు సుమన్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ లు సంఘీ భావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ ,కార్యదర్శి వెంకటరమణ ,సీనియర్ న్యాయవాదులు మోహన్ కుమార్ ,చంద్రశేఖర రావు ,తిరుపతయ్య గౌడ్ శశిభూషణ్,ఉమా మహేశ్వర్ రెడ్డి, పుష్పలత, గోపాల్ రెడ్డి, అశోక్ రావు, మునగారి కృష్ణ, మహమ్మద్, రఘువంశీ, రాజు గౌడ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.




రిలే నిరాహార దీక్ష లో మాట్లాడుతున్న న్యాయవాది

## సొంతింటి కల నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై నూతన వస్త్రాలు అందజేత**

**అడ్డాకుల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** నిరుపేద కుటుంబాలకు ఇల్లు లేని సొంతింటి కల ను ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం నాడు మండల కేంద్రంలోని నెక్కొండ నిర్మల నర్సమ్మ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరై నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే సతీమణి కవిత జి.మధుసూదన్ రెడ్డికి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఉప్పరి చెన్నమ్మ, కావలి మన్నెమ్మ, చాంద్ బి, ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి. దశరథ రెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి గంగుల విజయ మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శకుంతల, వేగనాద్, శేఖర్ రెడ్డి, సతీష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత జి. మధుసూదన్‌రెడ్డి



ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

## ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు

**మల్దకల్ ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భా గంగా మొదటి సంవత్సరం తెలుగు మరియు హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు సిఎస్ నరసింహులు, డిపార్ట్మెంటల్ అధికారి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో తెలుగు మరియు హిందీ పరీక్షలకు గాను మొత్తం 159 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 155 మంది హాజరైనట్లు నలుగురు గైర్హాజరు అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని జిల్లా పరీక్ష ల నియంత్రణ అధికారి దేవేందర్ రెడ్డి పరిశీలించినట్లు తెలిపా రు. అదేవిధంగా పరీక్షా కేంద్రం ఏరియాలో శాంతి భద్రతలను అడిషనల్ ఎస్పీ కూడా పరిశీలించి వెళ్లినట్లు వారు తెలిపారు.

## పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

**మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నక్క రమేష్ ముదిరాజ్**

**కోయిలకొండ ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని మండల బిజెపి ప్రధాన కార్యదర్శి నక్క రమేష్ ముదిరాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన కోయిలకొండలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు జరుగుతుండడంతో అక్కడి ప్రదేశంలో మంచినీటి వసతి, కూలీలకు నీడ తదితర వసతుల ను వెంటనే కల్పించాలని మండల ఉపాధి హామీ అధికారికి సూచించారు. వేసవిలో కూలీలకు వడదెబ్బలు తగులకుండా ఉపాధి హామీ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవస రం ఎంతైనా ఉందన్నారు. మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలను పర్యటించడం జరుగుతుందన్నారు.



## వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

**భూత్పూర్,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** వార్డు ప్రజల సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చి ఎన్నికల్లో విజయం సాధించి కౌన్సిలర్ పదవీ చేపట్టిన భూత్పూర్ పట్టన మున్సిపాలిటీ నాల్గోవార్డు గడ్డం ప్రేమ్‌కుమార్ తన మాట ప్రకారం వార్డు సమస్యల పరి ష్కారానికి శ్రీకారం చుట్టారు.బుధవారం తన వార్డు ఇందిరానగర్ కాలనీలో మార్నింగ్‌వాక్ పేరిట వార్డులో విస్తృతంగా పర్య టిస్తూవార్డు ప్రజలను కలుస్తూ సమస్యలు అడిగి తెలుసుకుంటూ విధిగా నోట్‌చేసుకుని వాటిని పరిష్కరించే దిశగా అడుగేస్తు న్నా రు. కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ వెంట బీఆర్ఎస్ నాయకులు గడ్డం భీమస్వామి,యాదయ్య,దొబ్బలి శ్రీశైలం,చీపుర్ల తిరుపతయ్య, గడ్డం వెంకటయ్య,మండి వెంకటయ్య,ఎం వెంకటయ్య, రామస్వామి,వడ్ల బాలకృష్ణ,రవికల్యాణ్,గాంధీ తదితరులున్నారు.

## అంగన్వాడి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్

**గండీడ్ ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** బల్సురుగొండ గ్రామంలోనీ అంగన్వాడి సెంటర్లో బుధవారం అంగన్వాడి సెంటర్ లోని బాల బాలికలకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫామ్ ను సర్పంచ్ ఖాజా మైనోద్దీన్, గ్రామ కార్యదర్శి శిరీష, అంగన్వాడీ టీచర్ పుష్పలత ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, యువజన నాయకులు వంశీధర్ రెడ్డి, కేశవులు, చాంద్ పాషా, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారికి మాదిగ వారు ఘనంగా బోనాలు సమర్పించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిసారి పండుగతో పాటు బోనాల కార్యక్రమం ఉంటుందని మాదిగ పెద్దలు, యువకులు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి రేణుక ఎల్లమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం జరుపుకునే ఈ పండుగకు ఈ సంవత్సరం భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ మేతర్ల గుద్దటి నరసయ్య, గుద్దటి బాల్ చంద్రయ్య, చిట్టిగోరి దుర్గయ్య, ఉప్పరి నిరంజన్, గొర్రె లక్ష్మయ్య, దర్గయ్య, వెంకటయ్య, చంద్రయ్య, మల్లయ్య, కాటమయ్య, శ్రీను, బాలరాజు, రవి, వెంకటేష్, నాగార్జున,జగన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి : సర్పంచ్ శివకుమార్

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని పర్దిపూర్ గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ సూచించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడి 2 కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల సంఖ్య, పౌష్టికార పంపిణీ, విద్యాబుద్ధులు ఎలా నేర్పిస్తున్నారని అంగన్వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పరిశుభ్రతతో పాటు నిత్యం గుడ్లు, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు సక్రమంగా తమ విధులను నిర్వహించాలని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ఫిర్యాదులు రాకుండా సక్రమంగా విధులు నిర్వహించి చిన్నారులకు విద్య పట్ల ఆసక్తి పెరిగేలా చూడాలని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడి కేంద్రాలపై సూపర్‌వైజర్లు పర్యవేక్షణ ఉండాలని ఆయన సూచించారు.




# మున్సిపాలిటీల ఆదాయ వనరులివే

● ప్రత్యేక నిధులతో పురపాలికల అభివృద్ధి ● నూతన పాలక మండళ్లకు సదా అవకాశం

**మద్దూరు, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** పట్టణాలు నగరాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వస తులు కల్పించేందుకు మున్సిపాలిటీలు వివిధ వర్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటాయి. వాటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పాలు రకాల నిధులు సమకూరుతాయి. ఆ నిధులతో నూతనంగా ఏర్పడిన పాలకవర్గాలు మున్సిపాలిటీలను అభివృద్ధి చేసుకునే వీలుంటుంది.

**ఆస్తి పన్ను :** ఇది మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరు. ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలపై అధికారులు ఆస్తి పన్ను విధిస్తారు.

**నీటి వన్ను :** పట్టణంలోని గృహాలకు తాగునీటి సరఫరాతో పాటునల్ల కనెక్షన్‌కు సంబంధించినది.

**లైసెన్సు ఫీజులు :** దుకాణాల లైసెన్సులు, హోటళ్లు, అనుమతులకు యజమానుల నుంచి కొంత రుసుము వసూలు చేస్తారు.

**భవన నిర్మాణ అనుమతులు:** కొత్తగా ఇళ్లు నిర్మించడం లేదా భవనాల ప్లాన్ల ఆమోదానికి వేసే పన్ను.

**మార్కెట్ అద్దె:** మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని ఉన్న దుకాణ సముదాయాలు, సంతలు, మాంసపు దుకాణాల ద్వారా అద్దెల రూపంలో ఆదాయం అందుతుంది.

**జరిమానాలు:** నిబంధనల ఉల్లంఘున, స్థలాల అక్రమణలకు పాల్పడిన వారికి జరమానాలు వేస్తారు.

**స్టేట్ ఫైనాన్స్ నిధులు :** జనాభా సంఖ్యను బట్టి పురపాలికాలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా స్టేట్ ఫైనాన్స్ నిధులను విడుదల చేస్తుంది. టియుఎఫ్ఐడిసి (తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ) పేరిట డబ్బులు విడుదల చేస్తుంది. వాటిని పరిశుద్దానికి, వివిధ రకాల పరికరాలను కొనుగోలు చేయడానికి ఖర్చు చేస్తారు. కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానం చేసిన తర్వాత ఖర్చు చేయాల్సి ఉంటుంది.

**ప్రజల సహకారంతోనే వేగవంతమైన అభివృద్ధి**

**- సి. శ్రీకాంత్, కమిషనర్**

మద్దూరు మున్సిపాలిటీ కమిషనర్ సి. శ్రీకాంత్ మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీ ఏర్పడ టం అభివృద్ధికి మంచి అవకాశం అని అన్నారు. స్వీయ ఆదాయాన్ని పెంచుతూ, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను పారదర్శకంగా వినియోగిస్తామని తెలిపారు. ప్రజలు పన్నులు సమయానికి చెల్లించి సహకరిస్తే మద్దూరు ఆదర్శ మున్సిపాలిటీగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## పట్టుబడిన రేషన్ బియ్యం వేలం


వేలం పాటలో విక్రయించిన రేషన్‌బియ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** జిల్లాలో కోస్గి స్టాక్ పాయింట్‌లో నిల్వ ఉంచిన అక్రమంగా పట్టుబడిన 644 క్వింటాళ్లు 67 కిలోల రేషన్ బియ్యాన్ని బుధవారం జిల్లా డీఎస్ఓ కార్యాలయంలో అధికారులు వేలం నిర్వహించారు. ఈ బియ్యం గతంలో విజిలెన్స్ అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకుని నారాయణపేట, మక్తల్, కోస్గి స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచినట్లు సమాచారం. వేలంలో మొత్తం తొమ్మిది మంది పాల్గొన్నారు. దామరగిద్ద మండలం చౌడేశ్వర ట్రేడర్స్ యజమాని హరికృష్ణ కిలోకు రూ. 27.10 పైసలకు అత్యధిక ధరకు వేలం పాడి మొత్తం 644 క్వింటాళ్లు 67కిలోల బియ్యాన్ని దక్కించుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, కొంత మంది వ్యాపారులు గతంలో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి ఒకేచోట నిల్వఉంచి బ్లాక్ మార్కెట్‌కు అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టాక్‌గా నిల్వ ఉంచిన బియ్యం పురుగులు పట్టి పాడైపోతు న్నదన్న వార్తలు సామాజిక మాధ్యమాలు మరియు దిశ పత్రికలో ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు వేలం ప్రక్రియ చేపట్టారు. జిల్లా డీఎస్ఓ మొగులప్ప ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ వేలంలోహరికృష్ణ విజేతగా నిలిచారు. వేలంలో దక్కించుకున్న బియ్యానికి సంబంధిం చిన మొత్తం మొత్తాన్ని వారం రోజుల్లో ప్రభుత్వ ఖజానాకు చెల్లించి, అనుమతి పత్రంతో స్వాధీనం చేసుకోవాలని అధికారుల సూచించినట్లు తెలిసింది.

## బాలానగర్ మండల సర్పంచుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**జడ్చర్ల (బాలానగర్), ఫిబ్రవరి 25 ప్రభాత వార్త:** బాలానగర్ మండలంలో సర్పంచుల సంఘం మండల కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోచమ్మ గడ్డ తండా సర్పంచ్ జె.కుమార్‌నాయక్‌ను మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చెన్నమ్మ శ్రీను, నేనావత్ శ్రీనునాయక్, సునీత నరేష్ నాయక్‌లను, ప్రధాన కార్యదర్శులుగా రాజేందర్ సింగ్, కవిత శివనాయక్, కోశాధికారిగా కుమార్ నాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా జంగమ్మ, జంగయ్య, వసంత యాదగిరి, అరుణ భాస్కర్ నాయక్, కె.వెంకటేష్‌నాయక్, రాజునాయక్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సంఘం అధ్యక్షులు కుమార్ నాయక్ ను బాలానగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, సర్పంచుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటేశ్వర రెడ్డి, రాంజీనాయక్, వేణు, శశివర్ణ పవన్ కుమార్ మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాల పరిరక్షణే మా పరమావధి

■ప్రభుత్వ అంబులెన్స్ సిబ్బంది



**అయిజ ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ప్రజల ప్రాణాల పరిరక్షణగా తమ కర్తవ్యం నిర్వహిస్తామని 108 మరియు 102 అంబులెన్స్ సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి యందు 108మరియు 102 అంబులెన్స్ సేవలపై నేషనల్ క్వాలిటీ ఆడిటర్ ఫియాజ్ షైక్‌సమగ్రంగా ఫిజికల్ ఆడిటర్ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగమే బాధ్యత శ్రమే ఆయుధం ప్రజల ఆరోగ్యమే మా ఆకాంక్ష అనే నినాదంతో 108 సిబ్బంది ప్రతిరోజూ ప్రజాక్షేత్రంలో అంకితభావం సేవలుఅందిస్తున్నారని అన్నారు. అత్యవసర సమయాల్లో ఒక క్షణం కూడా విలువైనదే అన్న దృష్టిలో ఆక్సిజన్ సిలిండర్ సెక్షన్ యంత్రాలు మానిటర్లు టచర్లుతదితర పరికరాల పనితీరుపరిశీలించు కోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, స్టాక్ రిజిస్టర్, పేషెంట్ కేర్ రికార్డులు, కాల్‌లాగ్ బుక్స్‌వంటి పత్రాలను సమీక్షించారు కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నర్సింలుగారు, పైలెట్లు శ్రీధర్, భార్గవ్, అహ్మద్, గారు పాల్గొని అవసరమైన వివరాలు అందించారు.

## భూ తగాదాలో మహిళా రైతుపై దాడి

**గద్వాల ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** భూ తగాదాలలో మహిళా రైతు పై దాడి చేయగా ఆమెకు తలపై తీవ్ర గాయాలు అయ్యాయి, పరిస్తితి విషమంగా ఉండడంతో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారంజోగులాంబగద్వాల జిల్లా గట్టుమండలం ఆలూరు గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. పొలం తగాదాల నేపథ్యంలో రాణి (45) అనే మహిళా రైతుపై ప్రత్యర్థులు విచక్షణారహితంగా దాడికిపాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు వెంటనే గద్వాలఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతంరాణి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు ప్రాథమిక విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎమ్మెల్యే పై నిరాధారణమైన ఆరోపణలు మానుకోవాలి

◆ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి, ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** ప్రజల హక్కులను పరిరక్షిస్తున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడిన మాటలు అన్నీ వెనక్కి తీసుకోవాలని, పెబ్బేరు సంత ప్రజలకు అంకితం చేసేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై నిరాధారణమైన మాటలు మానుకోవాలి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ లు డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్, మాజీకౌన్సిలర్ బ్రహ్మచారీ, వైస్ చైర్మన్ మధు సూదన్‌గౌడ్, కౌన్సిలర్ శరవంద మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల చరిత్ర ఉన్న పెబ్బేరు సంత పెబ్బేరు ప్రజలకు జీవనోపాధిగా ఆసరాగా నిలుస్తున్న సంతను బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సంతను కబ్జా చేసే కుట్రలు చేయడం వల్ల ఆటంకాలు ఎదుర య్యాయి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎంపీడీవో కార్యా లయం ముందు ఉన్న స్థలాన్ని, పెబ్బేరు సంత స్థలాన్ని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అనుచరుడికి కట్ట పెట్టేందుకు కుట్రలు చేసిన సంగతి ప్రజలందరికీ తెలుసు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి చేసిన భూకబ్జా విషయాలపై ప్రజలకు తెలియ చెప్పినఎమ్మెల్యేపై నిరాధారణమైన మాటలు మాట్లాడడం సిగ్గు చేటు అన్నారు. ఎమ్మెల్యేపై అసభ్య పదజాలంతో మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజల కోసం అండగా ఉంటూ ప్రజల పక్షిపాతిగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పై ఆరోపణలు సహించబోమన్నారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకులకు తగినబుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. వరుసగా ఓటమినిఅంగీకరించలేకనే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అక్కస్సుతో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా, ప్రముఖన్యాయవాదిగా సేవలందిం చిన మీరు అసభ్య పదజాలంతో దూశించడం పై తప్పుబాట్టారు. సభ్య సమాజానికి మానవ విలువలను నేర్పించాల్సిందిపోయి, నోటికి కొచ్చిన మాటలు మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించడంతో కాంగ్రెస్ గెలుపును స్వీకరించలేక, ఓర్వలేని తనంతో, కాంగ్రెస్ పార్టీనాయకులపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నా రన్నారు. రాజకీయ విలువలతో కూడిన సమాజాల్లో అన్యాయం జరుగుతున్న సంఘటనలు స్పందించి తనవంతుగా బాధ్యత వహించాలని హితువు పలికారు. ఈ సమావేశంలో ప్రముఖ డా. పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు శివ, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు జానకి రాములు, తిరుపతయ్య, పలువురు ఉన్నారు.

# శిక్షణా తరగతులకు అరకొరగా వార్డు సభ్యుల హాజరు!


శిక్షణ తరగతులకు అరకొరగా హాజరైన వార్డు సభ్యులు

**నవాబుపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ప్రభుత్వం నూతన సర్పంచులకు వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి మండల వ్యాప్తంగా వార్డు సభ్యులు అనాసక్తి చూపుతున్నారు. ఉదయం శిక్షణా తరగతులకు హాజరైన వార్డు సభ్యులు కూడా మధ్య మధ్యలో, వెళ్ళిపోతూ లంచ్ టైంకి అరకొరగా 15 నుండి 20 మంది వార్డు సభ్యులు కూడా లేకపోవడం గమనార్హం. మీటింగ్ హాల్లో 80 కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా గ్రామానికి దాదాపు పది నుండి 12 వార్డు సభ్యులు ఉన్నా కూడా వార్డు సభ్యులు హాజరు కాకపోవడం పై విమర్శలు వెలువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని ఎంపీపీ శిక్షణ కార్యలయంలో వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. జిల్లా ట్రైనింగ్ అధికారులు వార్డు సభ్యులకు స్థానిక సంస్థల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్రను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులకు వార్డు సభ్యులు తప్పకుండా హాజరు కావాలని అధికారులు కోరుతున్నా వార్డు సభ్యులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు కఠినమైన హెచ్చరికలు జారీ చేసి వార్డు సభ్యులు అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

◆ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం, వ్యవసాయ సహకార సంఘం గోదాం పరిశీలించిన కలెక్టర్


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో పర్యటించి మండలంలో నిర్మాణంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వచ్చేవారం, గరిష్టంగా 10రోజుల్లో భవనాన్ని పూర్తి చేసి అప్పగించాలని స్పష్టం చేశారు. అనుమతించిన మ్యాపు ప్రకారం నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఎక్కడ నిరక్ష్యం ఉండకూడదని సూచించారు. అనంతరం శ్రీరంగాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదామును సందర్శించి యూరియా ఎరువుల నిల్వలను పరిశీలించారు. యూరియా స్టాక్ బోర్డును తనిఖీ చేసి నిల్వలు సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్ దరఖాస్తు ద్వారా యూరియా బుకింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని పారదర్శకంగా పంపిణీ జరగాలని కలెక్టర్ సూచించారు. తహసిల్దార్ రాజు, ఎంపీడీవో రవి నారాయణ, గ్రామ సర్పంచ్ మద్దిలేటి, ఏవో హైమావతి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# చేనేత కార్మికులకు జిఐ సర్టిఫికేషన్‌పై అవగాహన



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న అధికారులు

**నారాయణపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** నారాయణ పేటలో భౌగోళిక సూచిక అధికృత యూజర్ ఏజెన్సీ శిబిరం విజయవంతంగా నిర్వహించబడినట్లు సీఈవో తేజస్ తెలిపారు. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ శిబిరం ఎస్ ఆర్ గార్డెన్స్, వెజిటబుల్ మార్కెట్ సమీపంలో నిర్వహించబడింది. ఈ శిబిరం ద్వారా స్థానిక చేనేత కార్మికులకు జిఐ సర్టిఫికేట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు నమోదు ప్రక్రియపై వివరాలు తెలియజేసి ప్రత్యక్ష మార్గదర్శనం అందించారు. నారాయణపేట చేనేత చీరలు" వంటి సంప్రదాయ హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు జిఐ సర్టిఫికేషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అధికారులు తెలిపారు. జిఐ ద్వారా ప్రాంతీయ ఉత్పత్తులకు బ్రాండ్ విలువ పెరిగి, విస్తృత మార్కెట్ అవకాశాలు సృష్టించబడతాయని వివరించారు. ఇది మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి తోడ్పడటంతో పాటు ఎగుమతులు పెరగడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. జిఐ సర్టిఫికేషన్ వల్ల నేతదారుల సంప్రదాయ నైపుణ్యాలు రక్షించబడతాయని, అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన మక్తల్ ఎంజెపి విద్యార్థులు


షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ఆధ్వర్యంలో ఈనెల 25న ఎంజెపి బిసి బాలుర మక్తల్ పాఠశాలలో ,జిల్లా స్థాయి ఎంపికలో క్రీడా ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన ఎంజెపి బాయ్స్ మక్తల్ విద్యార్థులు భీమ్‌జీ, రాజేష్, డి. గణేష్, కె.ప్రభాస్, టీ. భరత్, టి.యోగేందర్, పి. శ్రావణ్, కే .కార్తీక్ రెడ్డి, బి.శ్రీనివాసులు, కె. గణేష్, కే. తరుణ్ నాయుడు, డి. రిషి ,బి. ఉపేందర్, ఎం. జయప్రకాష్, కే. తరుణ్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లుపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి. స్వప్న తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుండి మార్చి 2 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఇందర్ పాల్ నగర్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో జరుగు రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొంటారని వి.స్వప్న తెలిపారు. రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన ఎంజెపి విద్యార్థులను, అందుకు కృషిచేసిన ఎంజెపి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి. స్వప్నను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం, జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ హెన్రీ, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

# మహిళా సమైక్య భవనానికి భూమి పూజ


మహిళా సమైక్య భవనానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**ధన్వాడ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని యాంనోనిపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణపేట కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి భూమి పూజలో పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి , సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, మండల అధ్యక్షులు నరహరి, గ్రామ సర్పంచ్ బోయ నాగేశ్వర్, ఉపసర్పంచ్ సిద్ధప్ప, అధికారులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివోఏమహిళా సంఘం అధ్యక్షురాలు, సంఘ సభ్యులు, వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల సంఘ బలోపేతానికి సమైక్య భవనం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మహిళల శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనం కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూమి పూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడగా, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి మరో అడుగుముందుకు పడిన సందర్భంగా గ్రామంలో ఉత్సాహ భరిత వాతావరణం నెలకొంది.

## సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు


ఇంటర్ పరీక్షల కేంద్రాల వద్ద విద్యార్థులు

**దేవరకద్ర, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఊర్మిళాదేవి తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోని 417మంది విద్యార్థులకు గాను, ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, మొత్తం 409 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందు వచ్చి తమహాల్ టికెట్ నెంబర్లు రూమ్ నెంబర్లను గుర్తుంచుకొని పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనజరగకుండా ఎస్ఐనాగన్న పోలీసులను ఏర్పాటు చేశారు.

## ధన్వాడ నూతన ఎస్సైగా ఏ. వెంకటేష్ గౌడ్


ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేష్‌గౌడ్

**ధన్వాడ, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ధన్వాడ మండల కేంద్రంలోని ధన్వాడ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా ఏ.వెంకటేష్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మహబూబ్‌నగర్ విఆర్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ధన్వాడకు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ధన్వాడ ఎస్సైగా పనిచేసిన ఎస్సై రాజశేఖర్ మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఏ. వెంకటేష్‌గౌడ్ జిల్లా ఎస్పీ డా. వినీత్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేస్తూ మండల పరిధిలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సత్వర సేవలు అందిస్తూ, పోలీసులపై విశ్వాసంపెంపొందించే విధంగా పని చేయాలని ఆదేశించారు. నూతన ఎస్సై ఏ.వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిననమ్మకానికి జిల్లాఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పోలీస్-ప్రజల మైత్రినిబలోపేతం చేస్తూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

## పేటలో ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్స విజయవంతం

**నారాయణపేట, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** నారాయణపేటలోని గీతా హాస్పిటల్‌లో ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించబడింది. కన్సల్టెంట్ రేడియాలజిస్ట్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ నిపుణుడు డా.రవీందర్ లకవత్ ఆధ్వర్యంలో ఈ చికిత్స చేపట్టారు తీవ్రమైన కుడి దిగువ పొత్తి కడుపు నొప్పితో బాధపడుతున్న ఒక యువతికి 5.6 సెంటీమీటర్ల పరిమాణంలో ఓవేరియన్ సిస్టు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. టోర్షన్ ప్రమాదంగా ఉండటంతో తక్షణ చికిత్స అవసరమైంది. ఈ సందర్భంలో అల్ట్రాసౌండ్ మార్గదర్శకత్వంలో ఓవేరియన్ సిస్టు ఆస్పిరేషన్ అనే ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియోలజీ విధానం ద్వారా శస్త్ర చికిత్స లేకుండానే చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. చిన్న రంధ్రంద్వారా సూక్ష్మ పద్ధతిలో ఈ చికిత్స నిర్వహించబడింది. డే కేర్ విధానంలో అదేరోజు రోగిని డిశ్చార్జ్ చేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. తక్కువ ఖర్చుతో, తక్కువ నొప్పితో, వేగంగా కోలుకునే విధంగా ఈ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. ఆధునిక ఇమేజ్ గైడెడ్ మినిమల్లి ఇన్వేసివ్ చికిత్సలు ఇప్పుడు నారాయణపేట ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు.

## దోమల నివారణకు ఫాగింగ్


నివారణకు ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ముందస్తు చర్యలలో భాగంగా ఫాగింగ్ యంత్రం సాయంతో అన్ని వీధుల్లో నివారణ చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోమలురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, చెత్తను ఇంటి బయట పారవేయకుండా చెత్త బండిలో వేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలలో చెత్త చెదారం లేకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కప్పెటలో పర్యటించనున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) గురువారం భూత్పూర్ మండలంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ గురువారం సాయంత్రం మండలంలోని కప్పెట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కప్పెట గ్రామ సర్పంచి మాసగౌడ్, ఉపసర్పంచి శ్రీనివాసులు తెలిపారు.

## తాగునీటి సమస్య లేకుండా బోర్ ఏర్పాటు చేసిన సర్పంచ్ మహదేవ్ సాగర్



**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి25 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలం లోని నగరాల రెండో సెంటర్లో గత పది సంవత్సరాలుగా తాగు నీటి సమస్య ఉన్నందువల్ల గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విషయాన్ని గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్ సాగర్ తాగునీటి సమస్య లేకుండా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా భావించి ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డికి తెలియజేయగా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రెండోసెంటర్‌లో బోరు వేయించాలని తెలపగా గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్ నగరాల రెండో సెంటర్‌లో బోర్ వేయించడం జరిగింది. గ్రామప్రజలు గ్రామసర్పంచ్ గుంటి మహదేవికి, ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

